REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 11-9-59

# జమీన్ రైతు

సంపుటి 31 ; సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి ; సంచిక 37

## హైదరాబాద్ లేఖ

* * * మా విలేకరి * * *

### ● సుబ్బారెడ్డిగారి రాజీనామా ఎవరో గిట్టనివారు, తగాదాలేనిదే సంతృప్తిచెందనివారు పుట్టించిన పుకార్లట!–పత్రికావిలేఖరులతో ముఖ్యమంత్రి

### ● 'యోగ్యులు, చిత్తశుద్ధికలవారు, త్యాగులు'— పి. వి. జి. రాజుగార్నిగూర్చి సంజీవరెడ్డిగారి ప్రశంసలు—'కాంగ్రెస్‌లోకివస్తే స్వాగతం!'

శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి రాజీనామా చేసిన మాట నిజమేనా అని గతవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అడిగిన ప్రశ్నకు "కాదు" అని సమాధానం చెప్పి ముఖ్యమంత్రి తృప్తి పడలేదు. ఎవరో గిట్టనివారు, లేదా ఏదో తగాదా లేనిది సంతృప్తి చెందనివారు ఇలాంటి పుకార్లు పుట్టిస్తూ ఉంటారు అనే ధోరణిలో ఉటంకించారుకూడా. సుబ్బారెడ్డిగారుకూడా ఒకరో ఇద్దరో విలేకర్లు ఆయన ఇక్కడ ఉండగా, ఈ విషయమై ప్రశ్నిస్తే, రాజీనామా పెట్టాననడం నిజం కాదన్నారు. ఇక ఆ విషయం చర్చించడానికి విముఖత చూపారు. నిజం కాదని ఇప్పుడాయన చెప్పినప్పటికీ ఆ వార్త ప్రచారణమై ఇంతకాలమైనప్పటికీ దాన్ని బహిరంగంగా ఖండించే యత్నమాయన చేయలేదు. శాసన సభ సమావేశానికి నగరంలో ఉన్నా హాజరు కాకపోవడం ఎవరూ కాదనలేని సత్యమే కదా! అయినా ఆ వార్తా ప్రచారణకు ముఖ్యమంత్రి ఏవో ఉద్దేశాలు అంటగట్టడం ఏమంత సబబుగా లేదు. కేవలం కాని వివరాలు వెల్లడి అయినప్పుడు తప్పించుకోవడానికి ఏదో చెప్పడం, ముఖ్యంగా పత్రికలను దూషించడం, రాజకీయవేత్తలకు పరిపాటి. మండల కాంగ్రెసు కమిటీ అధ్యక్షుని నుండి ప్రధాన మంత్రి వరకు అందరూ ఈ విషయంలో ఒకే టోను వినిపిస్తున్నది.

★

మాజీ డెమొక్రాట్లు (వీరిని మాజీ కె. ఎల్. పి. వారంటేనే పాఠకులకు బాగా తెలుస్తుందనుకుంటాను) వచ్చే వారం నగరంలో సమావేశమై స్వతంత్రపార్టీలో చేరే విషయమై చర్చించబోతున్నారు. కాబట్టి సోషలిస్టు డెమొక్రాటిక్ పార్టీలోని సోషలిస్టులను, ముఖ్యంగా పి. వి. జి. రాజుగారిని కాంగ్రెసులో చేర్చుకునే విషయమై ఏమైనా యత్నం చేస్తారా అని ప్రశ్నిస్తే ప్రత్యేకమైన ప్రయత్నం చేయకపోయినా వారు కాంగ్రెసులో చేరదలిస్తే స్వాగతమిస్తామంటూ రాజుగారు చాలా యోగ్యులు, చిత్తశుద్ధికలవారు, త్యాగులు అని ముఖ్యమంత్రి ఆయన్ని కొనియాడారు. కొంతకాలంగా రాజుగారు కాంగ్రెసులో చేర్తారని రాజధానిలో పుకారుగావుంది. ఇందులో నిజంలేదని సోషలిస్టు వర్గాలవారు అంటున్నారు. కొంతకాలం క్రితం ఆంధ్రపత్రిక విలేకరి విజయనగరం నుంచి ఒక వార్త పంపుతూ రాజుగారు కాంగ్రెసులో చేర్తారన్నట్టుగా ధ్వనింపచేశాడు. దానిపైన రాజుగారికి చాలా కోపం వచ్చింది. ఆ విలేకరిపై తమ ఆగ్రహాన్ని ప్రకటించారుకూడా. కాని ఇటీవల ఢిల్లీలోను, ఇతర ఉత్తర హిందూస్థాన్ ప్రాంతాలలోను రాజుగారు ప్రొఫెసర్ శిబ్బన్‌లాల్ సక్సేనాతో కలిసిన్నీ, విడిగాను చేసిన ప్రకటనలు, ముఖ్యంగా, దేశంలోని అభివృద్ధి నిరోధకులంతా, స్వతంత్రపార్టీ పేరుతో ఏకమవుతున్నారు; ఈ ముప్పు ఎదుర్కొనడానికి సోషలిస్టు శక్తులన్నీ, ఏ పార్టీలో వున్నప్పటికీ, ఐక్యం కావాలని చేసిన ప్రకటన, సోషలిస్టు డెమొక్రాటిక్ పార్టీలోని, [illegible] సోషలిస్టులు కాని వారలకు చాలా అసంతృప్తి కలిగించింది. ఈ అసంతృప్తి క్రమంగా చీలికగా పరిణమిస్తే ఆశ్చర్యపడవలసిందేమీ వుండదు.

ఈ పరిస్థితిలో ఆంధ్రలో పి. వి. జి. రాజుగారు విస్తృతమైన సోషలిస్టు ఉద్యమాన్ని నిర్మించగలుగుతారనే విశ్వాసం సోషలిస్టు కార్యకర్తలకు సడలింది. అందుకే ఈ కార్యకర్తలు ఎక్కడికక్కడ [illegible] కాని కాంగ్రెసులో చేరిపోవాలనే నిర్ణయం తీసుకుంటున్నారు. ఇటీవల హైదరాబాదు,

—కొంవ 7-వ పేజీలో

## నెల్లూరు, గూడూరు మునిసిపల్ ఎన్నికల సంరంభం

———o———

### నెల్లూరులో నాలుగు రాజకీయ పార్టీలకుచెందిన వారి మధ్య పోటీ: గూడూరులో కలయికల స్వరూపం యింకా స్పష్టంగా ఏర్పడలేదు

నెల్లూరు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ ఘట్టం గడచిపోయింది.

ఈ ఎన్నికలలో కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, జనసంఘీయులు పోటీచేస్తున్నారు.

అధికారయుతంగా కాంగ్రెసు పోటీచేయకపోయినప్పటికీ, కాంగ్రెసు సానుభూతి వర్గంగా శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డివర్గం 28వార్డులలోని 32 స్థానాలకు పోటీచేస్తున్నారు. శ్రీ సుబ్బారెడ్డి వర్గంలోని మాజీ కౌన్సిలర్లు 16 మంది యీ దఫాకూడా వున్నారు.

పౌరసమితి ముసుగులో కమ్యూనిస్టుపార్టీ కూడ 27 స్థానాలకు పోటీచేస్తున్నది. ఈ నియోజకవర్గం శాసన సభ్యుడు శ్రీ స్వర్ణ వేమయ్య, డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి, వారిసతీమణి, కమ్యూనిస్టుపార్టీ న్యాయ సలహాదారు శ్రీ వి. అనంతరామయ్య, కమ్యూనిస్టుల అభ్యర్థిగా ట్రంకురోడ్డులో చిత్రించుకొనే ప్రజా సోషలిస్టు ఆర్. దేవదానం, హిందూమహాసభ నాయకుడు బేలూరు సుబ్బరాయుడు, షేక్ [illegible] కుమార్, ఆయన సతీమణి, పసుపూరు రామకోటయ్య, తేళ్ళ రామప్ప యిత్యాది కమ్యూనిస్టు ప్రముఖులు, కమ్యూనిస్టు వర్గంగా పోటీచేస్తున్నారు.

ఈ దఫా సుబ్బారెడ్డి గారి వర్గంలో పాతికేళ్ళ పట్టాదార్లు కొందరు, క్రొత్త రక్తం — లాయర్లు, డాక్టర్లు, సంఘసేవకులు– వుండడం విశేషం. ఇందులో హరిజనులంటే ప్రాణాన్నివ్వడానికైనా సిద్ధపడే అతిమంచి వాడైన ఏనుగ పట్టయ్య 28 వ వార్డులో పోటీ చేస్తున్నారు. ఈ వార్డులోని ఓటర్లు ఎక్కువగా పేదజనం, తమకు బిడ్డలు లేకపోయినా దాదాపు వెయ్యిమంది 'దరిద్రనారాయణుల'ను కడుపులో పెట్టుకొని చాకే పట్టయ్యను ఆదరిస్తారో; నోటిమాటలతో పేదలమీద సానుభూతిమాపే రాజకీయ వాదిని అభిమానిస్తారో చూడవలసింది. మొత్తానికి యిది 'టెస్టు' పోటీ గావుంటుంది.

లోహియా సోషలిస్టుపార్టీవారు రెండు స్థానాలకు, జనసంఘంవారు రెండుస్థానాలకు పోటీచేస్తున్నారు. వారిలో లోహియా సోషలిస్టు గండికోట వెంకటేశ్వర్లు, ఆంధ్రపత్రిక

—కొంవ 6-వ పేజీలో

మలబద్ధకము మిమ్ము క్రుంగదీయు చున్నదా!

**ఆరోగ్య లేహ్యము**

( Registered )

మీరు ప్రతిదినము రాత్రి కొలది 'ఆరోగ్యలేహ్యము' సేవించిన పొద్దుననే ఒక్కసారి సాఫీగా మలమును విసర్జింపజేయును. మలబద్ధకము, అతిఉష్ణము, పొలుమాలికను పోగొట్టి శరీరమునందు వుత్సాహమును కలుగజేయును. రక్తశుద్ధి, రక్తవృద్ధిపరచుచు మెదడును దేహమును బలపరచి ఆరోగ్యముగానుంచును. కడుపునొప్పులు, కీళ్లనొప్పులు మలేరియాచలిజ్వరాలకు దివ్యౌషధం-రుచి సువాసన కలిగియుండును.

ప్రతియింట నుండదగిన సంజీవిని!

20 తులముల డబ్బీ **2-0-0** * శాంపిల్ డబ్బీ **0-6-0**

అన్ని మందుల షాపులలో దొరకును.

జూబిలాన్‌ఫార్మసి, సుబేదారుపేట. నెల్లూరు

# చిత్రజగత్

'భద్రం' సమీక్ష

## స్వాతంత్ర్యహోమంలో ప్రథమ సమిధగా అర్పణ అయిన మహావీరుడు

# కట్టబొమ్మన్

వర్తకం చేసుకొనేందుకు వచ్చి, మనదేశీయుల మంచితనంవల్ల కాలూనే స్థలం సంపాదించి, ఆపైన కుట్రతో, కత్తితో, సర్వాధికారులను సామంతులను చేసుకొని, స్నేహితులమన్న కృతజ్ఞత్వం పెంచి, సామ్రాజ్య స్థాపన చేసుకొన్న ఈస్టిండియా కంపెనీదారుల యత్నాలను ప్రతిఘటించిన మొదటి స్వాతంత్ర్య వీరుల్లో వీరపాండ్య కట్టబొమ్మన్ ఒకడు. తలపడింది తనకన్నా ఎన్నోరెట్లు బలవంతులతోనే అయినా, ఆ పోరాటంలో కోటీవారివద్దనుండి అతనికి లభించింది వెన్నుపోట్లు, మోసాలుమాత్రమే అయినా, కేవలం దేశాభిమానం, ఆత్మాభిమానం, స్వాతంత్ర్యేచ్ఛలవల్ల ధైర్యంగా, చివరిదాకా స్థిరంగా, కత్తులను, కుటిలత్వాలను, కుట్రలను ఎదుర్కొని, స్వాతంత్ర్య హోమంలో సమిధగా సమాప్తమయిన అతని జీవితాన్ని పద్మినీ పిక్చర్స్‌వారు తీసిన అరవసినిమాను ఎ. సి. ఇ. వారు వర్మరాజుగారిచేత తెలుగు చేయించి మొన్న సెప్టెంబర్ 4 తేదిన ఆంధ్ర దేశం అంతటా విడుదలచేశారు.

ఆర్కాటు నవాబు, ఈస్టిండియా కంపెనీ వారి దగ్గర అప్పుచేసి, తీర్చలేక వారికి కొన్ని జిల్లాలమీద పన్నుల వసూళ్ళ అధికారం కట్టబెట్టిన ఫలితంగా ఆ ప్రాంతపు పాళెగాళ్ల మీద ఆ వర్తక సంస్థకు అధికారం లభిస్తుంది. తెల్లవాళ్ల బలానికి భయపడి, వారు పెట్టిన ఆశలకు మోసపోయి, తమమధ్యవున్న స్పర్థలవల్ల కళ్లుమూసుకుపోయి పాళెగాళ్ళంతా కంపెనీకి దాసోహం అంటారు. అనినవారిని నాశనం చేసేందుకు కంపెనీకి సాయంకూడా చేస్తారు. ఒక్క పాంచాలకురిచి పాలకుడు కట్టబొమ్మన్ మాత్రం, కంపెనీ బెదిరింపులకు భయపడకుండా, ఆశలకు మోసపోకుండా, వారిని ప్రభువులుగా గుర్తించడానికి నిరాకరిస్తాడు. ఫలితంగా కంపెనీకి కట్టబొమ్మన్‌కీ కొంతకాలం నిష్ప్రయోజనమైన మంతనాలు జరిగి, ఆఖరుకు యుద్ధంజరిగి, కట్టబొమ్మన్ కోట నేలమట్టమై, అయినవారంతా మరణించి, రాజ్యం చితికిపోతుంది. కట్టబొమ్మన్ తమ్ముడితోపాటు మారువేషంలో అజ్ఞాతవాసం చేస్తుండగా, పొరుగు రాజు భటులు అతన్ని పట్టుకొని బందీనిచేసి కంపెనీకి అప్పజెప్తారు. కంపెనీవారు అతన్ని విచారించి ఉరితీస్తారు. యుద్ధంలో మరణం లభించలేదనే విచారంతో కట్టబొమ్మన్ కీర్తికాయుడవుతాడు.

కట్టబొమ్మన పాత్రను ప్రముఖ తమిళ నటుడు, శివాజీ గణేశన్ భక్తిగౌరవాలతో ఆరాధనా భావంతో ప్రశంసనీయంగా నిర్వహించారు. ఒక్కొక్కసారి మరీ అంత అవసరం అనిపించే ఆయాసం, వాగ్ధాటీ చూపించినా కొంత్తానికి, ఆ సర్వస్వాన్ని దట్టదగిగా, బలం, ధైర్యం, గౌరవం, మర్యాద, ఆత్మాభిమానం, ఆప్యాయతగల పరిపూర్ణ వ్యక్తిగా శ్రీ శివాజీగణేశన్ కట్టబొమ్మన్‌ను మనముందు నుంచోబెట్టారు.

చిత్రానికి బి. ఆర్. పంతులు దర్శకత్వం వహించారు. తమిళ చిత్ర సంప్రదాయాల సంకెళ్ళను పూర్తిగా తెంచుకోలేకపోయినా, సన్నివేశాలను దిట్టవుగా పటుపుగా చిత్రించారు. కట్టబొమ్మన్ ప్రకృతి ప్రవృత్తులను చిత్రించేందుకు వారు కల్పించుకొన్న సన్నివేశాలు వాటిని చిత్రించిన విధానాలు ప్రశంసనీయంగా వున్నవి. కానీ పాటల ద్వారా కథను పోషించడంలోను, 'స్క్రిప్ట్' కోసం ఎన్నుకున్నంది సన్నివేశాలలోను కథ చెప్పేటప్పుడు సరిగా లేకుండాపోయి, ముఖ్యంగా కనిపించి వుండవలసిన మానవత్వం మరుగయిపోయింది. దీనితోబాటు కథచెప్పడంలో వుండవలసిన చోట నిగ్రహం లేకపోవడంవల్ల, అనవసరమయిన చోటకూడా అతివాదధోరణి ప్రదర్శించడంవల్ల, కథనం చాలాబలం కోల్పోయింది. కట్టబొమ్మన్ పాత్రకు చూపినశ్రద్ధను మిగిలిన అంశాలకూ చూపించి, కంపెనీదొరలను, ఇంకా కొంత వివక్షణతో, ఊహతో వాడుకొనివుంటే కథ ఇంకాపటుత్వం కాగలిగేది. చిల్లరపాత్రల విషయంలో, ముఖ్యంగా ఆంగ్లేయుల పాత్రల విషయంలో హాస్యాస్పదాన్ని చెయ్యకుండా చేసుకోగలిగినట్లయితే కథకబలం, దర్శకుడికి పూర్తిగా న్యాయం చేసే అవకాశం, కట్టబొమ్మన్‌కు మరింతగౌరవం కల్పించే అవకాశం, ఇవన్నీ లభించి వుండేవి. కాని, ముందే చెప్పినట్లు దక్షిణభారతచలనచిత్ర సంప్రదాయాల సంకెళ్ళను దర్శకుడు పూర్తిగా తెంచుకోలేకపోవడంతో చిత్రం కొన్నిచోట్ల చప్పగాకూడా తయారయింది. ఐతే తెలుగుపాటల మొత్తంమీద కథలోవున్న ఈ లోపాన్ని, ఉద్రేకాన్నిమాత్రం ధిక్కరించలేము.

రంగాలంకరణలో ... ఈ చిత్ర విజయం లభించింది. ఛాయాగ్రహణం చక్కగా వున్నది. ముఖ్యంగా యుద్ధ సన్ని—

—10 వ పేజీలో



ధనలక్ష్మి ప్రొడక్షన్సువారి 'మహారధి కర్ణ' తెలుగు చిత్రంలో— విదురుని ఆశ్రమంలో పాండవుల సమాలోచనాదృశ్యం యిది. ఈ చిత్రం త్వరలో గోపికృష్ణ ఫిలిమ్స్‌ద్వారా విడుదల కానున్నది.

ఇక 'విలన్'గా తెలుగు సినిమాప్రేక్షకులను

మెప్పించగల నటుడేడీ?

## ఆర్. నాగేశ్వరరావు అకాలమరణం

ప్రముఖ సినిమా నటుడు శ్రీ ఆర్. నాగేశ్వరరావు ఈ నెల 5 తేది సాయంత్రం మరణించారు.

శ్రీ రాజనాల నాగేశ్వరరావు యిప్పటికి దాదాపు 30 చిత్రాలలో నటించారు. వారి ఇటీవలి చిత్రం, శభాష్‌రాముడు ప్రస్తుతం ఆంధ్రదేశం అంతటా ఆడుతోంది.

శ్రీ నాగేశ్వరరావు మరణానికి కారణం హృద్రోగం. మూడునాలుగు రోజులుగా వారు అస్వస్థగా వున్నారు. వ్యాధి ఉపిరితిత్తులదని తెలిసి, 5 వ తేది సాయంత్రం వారిని జనరల్ ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా వారు దారిలోనే మరణించారు.

నాగేశ్వరరావుగారి వయస్సు 33 సంవత్సరాలు. వారికి తల్లి, భార్య, ఐదుగురు పిల్లలు వున్నారు.

తెలుగు సినిమాలలో దుష్టపాత్రల పోషణలో శ్రీ నాగేశ్వరరావు చాలాపేరు సంపాదించారు. మంచి విగ్రహం, నిగ్రహంగల నటన. ఆయనకు తెలుగు నటులలో ప్రముఖస్థానాన్ని, తెలుగు దుష్టపాత్రల నటినయించే వారిలో విశిష్టస్థానాన్ని సంపాదించి పెట్టాయి.

కన్నతల్లి, దొంగరాముడు, రేచుక్క, దొంగల్లోదొర, రాజనందిని— వారు దుష్టపాత్రల నిర్వహించిన కొన్ని చిత్రాలు.

పెళ్లినాటిప్రమాణాలు, పెళ్లిసందడి వారు ఇతరపాత్రలు నిర్వహించిన చిత్రాలు. పెళ్లిసందడిలో వారినటన బహుపరిమితమయినా, నిగ్రహానికి, బలానికి చిరస్మరణీయం.

వైవిధ్యం, విభిన్నత్వం, విశిష్టత కూడగట్టుకొన్న వారిప్రజ్ఞ ఉపయోగించుకొనేఅవకాశం ఇకముందు లేకపోవడం, తెలుగుసినిమాల దుర దృష్టం.


పాత్రుడుగారి బాలసంజీవిని (రిజిష్టర్డు)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టర్ పిళ్లా పాపయ్యపాత్రుడు అండ్ బ్రదర్స్

19, దక్షిణమాడవీధి - మైలాపూరు - మదరాసు-4. ఫోన్ నెం. 71354 గా.

బ్రాంచి:- 7, సారంగపాణికోవిల తూర్పువీధి - కుంభకోణము.

అన్ని మందులషాపులలోను దొరకును

కాకర్ల కావమ్మయ్యగారి [illegible]

మా "ధనకస్తూరి" గుళికలు (రిజిష్టర్డు) పక్షవాతం, దద్రివాతం, దురద, తిమ్మిర్లను త్వరలో గ్యారంటీగా కుదురుస్తాము. మా ఫోటో ట్రేడ్ మార్కుగల ఔషధముమాత్రమే వాడుము. ... తెలుపుడు — యింతకు మించినది ప్రపంచములో లేదు.

ఒక వారమునకు ఔషధము రూ. 7/- లు. ప్యాకింగ్‌పోస్టేజి వేరు.

"ఆయుర్వేదభేషక్" . "వైద్యవిశారద" "ఖిలాఫ్" కాకర్ల వెంకటప్పయ్య

వి.బి. నాథ స్మారకిరు (రిజిష్టర్డు) ఆయుర్వేద ప్రాక్టీషనరు - 222, శాస్త్రివారివీధి - నెల్లూరు.

